సాక్షి
కర్నూలు

బుధవారం । 27 । ఆగస్టు । 2025




11మంది సీఐలకు స్థానచలనం

పోలీస్ శాఖ ఫోర్త్ జోన్ పరిధిలోని కర్నూలు, నంద్యాల, వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల పరిధిలోని వివిధ పోలీస్ సర్కిళ్లలో పనిచేస్తున్న 11 మంది సీఐలకు స్థానచలనం కలిగింది. 2లో▸



అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

ఎనిమిదేళ్లుగా దొంగతనాలు, దారిదోపిడీలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్న అంతర్రాష్ట్ర ముఠాను ఎట్టకేలకు పోలీసులు పట్టుకున్నారు. 2లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,626.06
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 17,377
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 16,916

న్యూస్‌రీల్

డీఎస్సీ అభ్యర్థుల ఉత్కంఠకు తెర

కర్నూలు సిటీ: డీఎస్సీ అభ్యర్థుల ఉత్కంఠకు తెర పడింది. సెలక్షన్ జాబితా విడుదలలో ప్రభుత్వ విఫలమైందనే ప్రచారం జరగడంతో ఎట్టకేలకు మంగళవారం మధ్యాహ్నం నుంచి కాల్ లెటర్లు పంపించడం మొదలైంది. సెలక్షన్ లిస్ట్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేందుకు మూడు, నాలుగు రోజులుగా సాంకేతిక సమస్యలు తలెత్తుతుండటంతో మొదట పీజీటీ, టీజీటీ పోస్టుల జాబితాలు ఖరారు కావడంతో ఎంపికైన అభ్యర్థులకు కాల్ లెటర్లు జారీ చేశారు. స్కూల్ అసిస్టెంట్లలో కొన్ని సబ్జెక్టులకు సంబంధించిన కాల్ లెటర్లు పంపించారు. అర్ధరాత్రిలోగా అన్ని క్యాడర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు కాల్ లెటర్లు జారీ చేస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

28న డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్‌ల పరిశీలన

కర్నూలు(సెంట్రల్): ఈనెల 28న డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన సజావుగా సాగేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనపై అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సర్టిఫికెట్ల పరిశీలనకు రాయలసీమ యూనివర్సిటీ, శ్రీనివాస బీఈడీ, రాఘవేంద్ర బీఈడీ కాలేజీల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. రాయలసీమ యూనివర్సిటీ కేంద్రానికి స్పెషల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, శ్రీనివాస బీఈడీ కాలేజీకి హౌసింగ్ పీడీ చిరంజీవి, రాఘవేంద్ర బీఈడీ కాలేజీకి పీఏ టూ స్పెషల్ కలెక్టర్ కొండయ్యలను ఇన్‌చార్జీలుగా నియమించామన్నారు. మూడు కేంద్రాల్లో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు. దివ్యాంగ అభ్యర్థులకు శుక్రవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సదరం సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు తగిన ఏర్పాట్లు చేయాలని సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లును ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, డీఈఓ శామ్యూల్‌పాల్ పాల్గొన్నారు.

జయ జయ శుభకర వినాయక !

నేడు వినాయక చవితి

- నేటి నుంచి గణేష్ నవరాత్రి ఉత్సవాలు
- జిల్లా వ్యాప్తంగా పూజలందుకోనున్న ప్రథమ పూజితుడు
- వినాయక విగ్రహాల ప్రతిష్టకు ఏర్పాట్లు పూర్తి
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొలువుదీరనున్న సుమారు 14 వేల విగ్రహాలు

ఓ బొజ్జ గణపయ్యా.. నీ బంటు నేనయ్యా.. అంటూ భక్తజనం వినాయక చవితి ఉత్సవాలకు సిద్ధమయ్యారు. మహా గణపతిని మనసారా స్మరించుకునేందుకు ఏర్పాట్లు షురూ అయ్యాయి. వాడవాడలా, ఇంటింటా గణేష్ ప్రతిమలను ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. మార్కెట్‌కు వెళ్లి పత్రం, పుష్పం, ఫలం సమకూర్చుకున్నారు. చిన్నా.. పెద్దా అందరూ పండగ నిర్వహణలో నిమగ్నమయ్యారు. అంతటా గణేశుడి సందడి నెలకొంది.



నగరంలో ప్రతిష్ఠించేందుకు భారీ గణేష్ విగ్రహాన్ని తరలిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: వినాయక చవితి పండగ రానే వచ్చింది. జిల్లా వ్యాప్తంగా బుధవారం వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకోనున్నారు. ఊరువాడ.. పట్టణం.. నగరం అన్న తేడా లేకుండా మండపాలు.. మిరుమిట్లు గొలిపే లైటింగ్.. డీజే పాటలు.. చిన్నా పెద్ద అందరూ కలిసి సందడి చేసుకునేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే విగ్రహాలు నెలకొల్పేందుకు మండపాలు ఏర్పాటు చేసుకున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 14 వేలకు పైగా విగ్రహాలు పూజలు అందుకోనున్నాయి. కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్ తదితర ప్రాంతాల్లో భారీ ప్రతిమలు ప్రతిష్ఠించి పూజలు చేయనున్నారు. వినాయక చవితి అంటేనే ఐక్యంగా నిర్వహించు కునే పర్వదినం. తొమ్మిది రోజులు పూజలు అందుకున్న పార్వతీ తనయుడు లంబోదరునికి సెప్టెంబర్ 4వ తేదీన వీడ్కోలు పలకనున్నారు. కర్నూలు నగరంలో నిర్వహించే వినాయక చవితి వేడుకలకు రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు ఉంది. ప్రస్తుతం 45వ ఏటా వేడుకలను నిర్వహిస్తున్నారు. రెండు విగ్రహాలతో ప్రారంభమైన వినాయక చవితి ప్రస్థానం ఇప్పుడు 2,600 విగ్రహాలకు చేరుకుంది. ఇందులో సుమారు 40 శాతం వరకు మట్టి వినాయక విగ్రహాలు కొలువు దీరనున్నట్లు కర్నూలు నగర గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు చెబుతున్నారు.



కొండారెడ్డి బురుజు వద్ద పండగ సామగ్రి కొనుగోలు చేస్తున్న భక్తులు

పర్యావరణ హితం వైపు..



పంచ భూతాల్లో ఒక్కటైన మట్టితో చేసిన వినాయకున్ని పూజించడంతో అనేక ప్రయోజనాలు కలుగుతాయన్నది పండితుల మాట. శుక్లాం భరధరం.. అంటూ హిందువులు నిర్వహించే ప్రతి శుభకార్యానికి ముందు గణపతిని పూజ చేసి పని ప్రారంభిస్తారు. వివిధ రకాల ఆకులు, పుష్పాల సువాసనల నుంచి మిశ్రమ వాయువులను పీల్చడంతో శ్వాస సంబంధిత వ్యాధులు దూరం కావడంతో పాటు మెదడు ఉత్తేజితమవుతుంది. ప్రకృతి సిద్ధమైన మట్టితో చేసిన గణపతి ప్రతిమలను పూజించి, తిరిగి వాటిని నీటిలో నిమజ్జనం చేయడంతో అవి నీటిలో సులువుగా కరిగి పంట పొలాలకు చేరడంతో భూములు సారవంతమవుతాయి. ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలతో ప్రకృతి హితంగా పండగను జరుపుకోవాలని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో చాలా ప్రాంతాల్లో పలు స్వచ్ఛంద సంస్థలు మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వివేకానంద స్టడీ సర్కిల్, సాయినాథ్ పతంజలి యోగా కేంద్రం, వాసవీ ఏజెన్సీస్ వారు ఇళ్లలో పూజించే మట్టి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు.

రానున్న ఐదు రోజులూ వర్షాలే..

కర్నూలు(అగ్రికల్చర్): రానున్న ఐదు రోజుల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు 10 మి.మీ, 30న మూడు, 31న 10 మి.మీ ప్రకారం వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉష్ణోగ్రతలు 32.7 నుంచి 33.2 డిగ్రీల వరకు నమోదవుతాయని.. గాలి తీవ్రత గంటకు 12 నుంచి 14 కిలోమీటర్లు ఉండే అవకాశం ఉందన్నారు. వారం రోజుల క్రితం వరకు జిల్లాలో అధిక వర్షాలతో ఉల్లి పంట భారీగా దెబ్బతినింది. మళ్లీ వర్షాలు పడే అవకాశం ఉండటంతో ఉల్లి రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎంబీబీఎస్ అడ్మిషన్లు ప్రారంభం



విద్యార్థినికి అడ్మిషన్ ఇస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ

కర్నూలు(హాస్పిటల్): స్టేట్ కోటా కింద కర్నూలు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. మంగళవారం 68 మంది విద్యార్థులు కళాశాలలో అడ్మిషన్ తీసుకున్నారు. వీరికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ అడ్మిషన్లు అందజేశారు. ఈ నెల 29వ తేదీ వరకు మొదటి విడత అడ్మిషన్లకు అవకాశముందని తెలిపారు.

ఆర్‌డబ్ల్యూఎస్‌లో ఎస్‌ఈల పదోన్నతికి ఆమోదం

కర్నూలు(అర్బన్): గ్రామీణ నీటి సరఫరా విభాగంలో కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఇన్‌చార్జి ఎస్‌ఈలుగా విధులు నిర్వహిస్తున్న బి.నాగేశ్వరరావు, సీహెచ్ మనోహర్‌కు రెగ్యులర్ ఎస్‌ఈలుగా పదోన్నతి కల్పించేందుకు ఆమోదం లభించింది. 2024–25 ప్యానల్ ఇయర్‌కు సంబంధించి పదోన్నతులకు అర్హులైన ఈఈల జాబితాను డీపీసీ (డిపార్టుమెంటల్ ప్రమోషన్ కమిటీ) రూపొందించి ఆమోదించింది. ఈ నేపథ్యంలోనే వివిధ జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న ఎనిమిది మంది ఈఈలకు ఎస్‌ఈలుగా పదోన్నతి లభించనుంది. ఇందుకు సంబంధించి ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శశిభూషణ్‌కుమార్ జీఓఎంఎస్ నెంబర్: 78ని జారీ చేశారు. ఈ జాబితాలో కర్నూలు, నంద్యాల జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఇన్‌చార్జి ఎస్‌ఈలు ఉన్నారు.

క్లుప్తంగా

సీసీటీవీ రిపేరీ, సర్వీస్‌లో ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని గ్రామీణ ప్రాంత యువకులకు కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో సీసీటీవీ రిపేరి, సర్వీస్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ కె.పుష్పక్ తెలిపారు. ఈ కోర్సుకు సంబంధించి సెప్టెంబర్ 12 నుంచి 13 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు యువకులు అర్హులని.. శిక్షణా కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. ఆసక్తి కలిగిన యువకులు కర్నూలు శివారు బి.తాండ్రపాడు సమీపంలోని కెనరాబ్యాంకు- గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ (డీఆర్‌డీఏ-టీటీడీసీ ప్రక్కన)లో, లేదా 9000710508 నెంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

సీపీఐ రాష్ట్ర కమిటీలో పలువురు జిల్లా వాసులకు చోటు

కర్నూలు(సెంట్రల్): ఆగస్టు 20 నుంచి 25వ తేదీ వరకు ఒంగోలులో జరిగిన సీపీఐ రాష్ట్ర మహాసభల్లో నూతనంగా రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీలో జిల్లా నుంచి పలువురికి చోటు లభించింది. రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పి.రామచంద్రయ్య, బి.గిడ్డయ్యలను ఎన్నుకున్నారు. రాష్ట్ర సమితి సభ్యులుగా ఎన్.లెనిన్‌బాబు, ఎస్.మునెప్ప, పి.రామకృష్ణారెడ్డి, జి.రంగన్న, పి.శ్రావణి, నబీరసూల్‌లను ఎన్నుకున్నారు. వీరందరికీ జిల్లా కమిటీ, అనుబంధ సంఘాల తరపున పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

సెల్‌ఫోన్ల రికవరీ



బాధితులకు సెల్ ఫోన్లను అందజేస్తున్న డీఎస్పీ

బేతంచెర్ల: మండలంలో చోరీకి గురైన 39 సెల్ ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాసులు బాధితులకు మంగళవారం సెల్‌ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోన్ పోగొట్టుకుంటే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫోన్ ఐఎంఈఐ నంబర్‌తో లేదా వాట్సాప్ ద్వారా కానీ ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

చెక్‌బౌన్స్ కేసులో జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): చెక్‌బౌన్స్ కేసులో జైలు శిక్షను విధిస్తూ స్పెషల్ క్లాస్ మెజిస్ట్రేట్ ఏసురత్నం మంగళవారం తీర్పు వెల్లడించారు. వివరాలు.. గడివేముల మండల కేంద్రానికి చెందిన నిందితుడు దూదేకుల కమాల్‌బాషా 2019లో లక్ష్మీదేవమ్మ వద్ద వ్యాపార నిమిత్తం అప్పు తీసుకున్నాడు. అప్పు తీర్చేందుకు ఇచ్చిన చెక్కు బ్యాంక్‌లో బౌన్స్ కావడంతో జడ్జి విచారణ జరిపి నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష, చెక్కు మొత్తం రూ.9.10 లక్షలు చెల్లించాలని తీర్పు వెల్లడించారు. అనంతరం నిందితుడిని జైలుకు తరలించారు.

బార్లకు అరకొర దరఖాస్తులు

- మరో మూడు రోజుల గడువు పెంపు
- ఈనెల 30న లక్కీ డిప్

కర్నూలు: బార్ల ఏర్పాటుకు సంబంధించిన నోటిఫికేషన్‌కు స్పందన కొరవడటంతో దరఖాస్తుల స్వీకరణకు మరో మూడు రోజులు గడువు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో 47 మద్యం బార్లకు లైసెన్సుల కేటాయింపునకు ఈనెల 18న నోటిఫికేషన్ జారీ అయిన సంగతి తెలిసిందే. దరఖాస్తు దాఖలుకు 26వ తేదీ చివరి రోజు. అయితే కర్నూలు జిల్లాలో 8 బార్లకు కేవలం 31 దరఖాస్తులు, నంద్యాల జిల్లాలో 7 బార్లకు 24 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. కనీసం 4 దరఖాస్తులు దాఖలయ్యే బార్లకే లాటరీ విధానంలో లైసెన్స్ కేటాయిస్తామని ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఈ లెక్కన కర్నూలులో 4, ఆదోనిలో 3 బార్లకు మాత్రమే నాలుగేసి దరఖాస్తులు వచ్చాయి. అలాగే నంద్యాల జిల్లాలో కూడా 5 బార్లకు మాత్రమే నాలుగు చొప్పున దరఖాస్తులు దాఖలయ్యాయి. నందికొట్కూరు, బేతంచెర్ల బార్లకు రెండేసి చొప్పున దరఖాస్తులు దాఖలయ్యాయి. కర్నూలులో గౌడ కులాలకు రిజర్వు చేసిన దుకాణాలకు రెండు దరఖాస్తులు దాఖలయ్యాయి. మంగళవారం పొద్దుపోయే దాకా ఉమ్మడి జిల్లాలో కేవలం 55 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి.



దరఖాస్తుల నమోదును పరిశీలిస్తున్న ఎక్సైజ్ నోడల్ అధికారి శ్రీదేవి, జిల్లా అధికారి సుధీర్ బాబు

పర్మిట్ రూమ్‌లు మంజూరు చేయడమే కారణమంటున్న వ్యాపారులు

మద్యం దుకాణాలకు పర్మిట్ రూమ్‌లు మంజూరు చేయడంతో బార్లకు దరఖాస్తు చేసుకునేందుకు ఎక్కువ మంది వ్యాపారులు ఆసక్తి చూపడం లేదనే చర్చ జరుగుతోంది. దుకాణాలకు ఇచ్చినట్లుగా కమీషన్ లేకపోవడం, ఒక్క బార్‌కు నాలుగు దరఖాస్తులు వేస్తేనే డ్రా తీయడం వంటి నిబంధనలు వ్యాపారులు భారంగా భావిస్తున్నారు. ఆ నిబంధనల వల్ల నష్టాల బారిన పడటం ఖాయమనే భావనతో చాలా మంది వ్యాపారులు దరఖాస్తుకు తటపటాయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలాఉంటేవ్యాపారుల నుంచి స్పందన కొరవడటంతో బార్ల దరఖాస్తుకు మరో మూడు రోజుల గడువు పెంచుతూ సవరణ షెడ్యూల్ విడుదల చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ నెల 30న లక్కీ డిప్ ద్వారా బార్ల కేటాయింపు ఉంటుంది.

శ్రావణమాసం ఆదాయం రూ.7.86 కోట్లు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామికి శ్రావణమాస ఆదాయం రూ.7,86,85,758 వచ్చినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ వాణి తెలిపారు. ఈ మొత్తం గత నెల 25నుంచి ఈనెల 23వరకు జరిగిన ఉత్సవాల్లో భక్తులు వివిధ రూపాల్లో స్వామికి సమర్పించిన కానుకలు, హుండీ, దర్శన, తలనీలా ల టిక్కెట్లు, ఖాళీ స్థలాల బాడుగల నుంచి వచ్చిన ఆదాయమన్నారు. గత ఏడాది ఆదాయం రూ.7.04కోట్లు కాగా.. ఈ ఏడాది రూ.82లక్షల అదనపు ఆదాయం సమకూరిందన్నారు.



ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయం

బస్సు రాలేదని పోలీస్ స్టేషన్‌కు చేరిన విద్యార్థులు

- పోలీసు జీపులో గమ్యస్థానాలకు పంపించిన ఎస్ఐ



విద్యార్థులను విచారిస్తున్న ఎస్ఐ దిలీప్‌కుమార్



పోలీసు జీపులో ముద్దటమాగికి వెళ్తున్న విద్యార్థులు

హొళగుంద: బస్సు రాలేదంటూ విద్యార్థులు పోలీస్‌స్టేషన్ మెట్లెక్కిన ఘటన హొళగుందలో మంగళవారం చోటుచేసుకుంది. ముద్దటమాగి గ్రామానికి చెందిన విద్యార్థులు హొళగుంద హైస్కూల్‌లో చదువుతున్నారు. రోజూ బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. మంగళవారం సాయంత్రం స్కూల్ వదిలిన తర్వాత హొళగుంద బస్టాండులో బస్సు కోసం దాదాపు 20 మంది విద్యార్థులు వేచి ఉన్నారు. ఎంతకూ బస్సు రాకపోవడంతో విద్యార్థులు సమీపంలోని పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. లోపుల ఉన్న ఎస్ఐ దిలీప్‌కుమార్ సీసీ కెమెరాలో విద్యార్థులను గమనించి సమస్యను ఆరా తీశారు. బస్సు రాలేదని చెప్పడంతో ఆయన ఆదోని ఆర్టీసీ డిపో మేనేజర్‌కు ఫోన్ చేసి విచారించారు. రోడ్డు బాగోలేకపోవడంతో బస్సు ఆలస్యమైనట్లు తెలుసుకుని ఎస్ఐ తన జీపులో విద్యార్థులను ముద్దటమాగికి చేర్చారు.

11 మంది సీఐలకు స్థానచలనం

కర్నూలు:పోలీస్ శాఖ ఫోర్త్ జోన్ పరిధిలోని కర్నూలు, నంద్యాల, వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల పరిధిలోని వివిధ పోలీస్ సర్కిళ్లలో పనిచేస్తున్న 11 మంది ఇన్‌స్పెక్టర్ల(సీఐ)కు స్థానచలనం కలిగింది. ఈ మేరకు కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ మంగళవారం బదిలీ ఉత్తర్వులు జారీ చేశా రు. ఉత్తర్వులు అందిన వెంటనే వారికి కేటాయించిన స్థానాల్లో చేరిపోవాలని డీఐజీ పేర్కొన్నారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
టి.అబ్దుల్ గౌస్	డీటీసీ, కర్నూలు	ఆదోని ట్రాఫిక్
జి.ఇబ్రహీం	సీసీఎస్ 3, కర్నూలు	డీటీసీ, కర్నూలు
జె.రమేష్ కుమార్	ఆదోని ట్రాఫిక్	సీసీఎస్3, కర్నూలు
ఎస్.చాంద్ బాషా	పులివెందుల యూపీఎస్	సోషల్ మీడియా అండ్ సైబర్ క్రైం సెల్,నంద్యాల
ఎస్.వంశీధర్	సోషల్ మీడియా అండ్ సైబర్ క్రైం సెల్, నంద్యాల	ఖాజీపేట యూపీఎస్
ఎం.తిమ్మా రెడ్డి	డీఎస్‌బీ 2, అన్నమయ్య	ప్రొద్దుటూరు వన్‌టౌన్
డి.రామకృష్ణారెడ్డి	ప్రొద్దుటూరు వన్‌టౌన్	రిమ్స్ యూపీఎస్
వి.సీతారామిరెడ్డి	రిమ్స్ యూపీఎస్	పులివెందుల యూపీఎస్
ఆర్.మోహన్	ఖాజీ పేట యూపీఎస్	వీఆర్, కడప
డి.బాలమద్దిలేటి	ప్రొద్దుటూరు రూరల్ సర్కిల్	సీకే దిన్నె యూపీఎస్
ఎం.నాగభూషణ్	సీకే దిన్నె యూపీఎస్	ప్రొద్దుటూరురూరల్ సర్కిల్

స్వామిత్వ వేగవంతానికి చర్యలు



గూగుల్ మీట్‌లో మాట్లాడుతున్న డీపీఓ భాస్కర్

కర్నూలు(అర్బన్): గ్రామ కంఠాల పరిధిలోని ఇళ్ల యజమానులకు హక్కు పత్రాల జారీకి సంబంధించిన స్వామిత్వ (సర్వే ఆఫ్ విలేజ్ అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రూవైజ్‌డ్ టెక్నాలజీ ఇన్ విలేజ్ ఏరియాస్) కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి జి.భాస్కర్ తెలిపారు. మంగళవారం పీఆర్‌అండ్‌ఆర్‌డీ కమిషనర్ క్రిష్ణతేజ నిర్వహించిన గూగుల్ మీట్‌లో డీపీఓ మాట్లాడుతూ ఈ నెల 1 నుంచి జిల్లాలోని 73 రెవెన్యూ గ్రామాల్లో స్వామిత్వ కార్యక్రమాలను వేగవంతం చేశామన్నారు. ఆయా గ్రామాల్లో ఇప్పటికే గ్రామ సభలను నిర్వహించామని, 44 గ్రామాల్లో గ్రామ కంఠం మ్యాపింగ్ కూడా పూర్తయిందన్నారు. ఆయా గ్రామాల్లో గ్రౌండ్ ట్రూథింగ్ కూడా జరుగుతోందని వివరించారు.

పంచాయతీలపై అధనపు భారం

జిల్లాలో చేపట్టిన స్వామిత్వ సర్వేకు సంబంధించిన ఆర్థిక భారం ఇక నుంచి గ్రామ పంచాయతీలపై పడనుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలపై ఎలాంటి ఆర్థిక భారాన్ని మోపకుండా ఈ ప్రక్రియ కొనసాగింది. అయితే కూటమి ప్రభుత్వం స్వామిత్వకు సంబంధించి గ్రామాల్లో చేపట్టే పనులకు అయ్యే వ్యయాన్ని గ్రామ పంచాయతీలే భరించాలని ఇటీవలే పీఆర్‌అండ్‌ఆర్‌డీ కమిషనర్ క్రిష్ణతేజ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఎలాంటి ఆదాయ వనరులు లేని గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అధికారుల ఆదేశాలను కాదన లేక, చేతి నుంచి డబ్బు వెచ్చించలేక ఇబ్బంది పడుతున్నారు.

హత్య కేసు నిందితుడికి జీవిత ఖైదు



బోయతోట శివను జైలుకు తరలిస్తున్న పోలీసులు

కర్నూలు: తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలోని నన్నూరు గ్రామంలో ఆటో డ్రైవర్ అజాం ఖాన్ సలాంబాషా హత్య కేసు నిందితుడు బోయతోట శివ (35)కు జీవిత ఖైదు, రూ.6 వేలు జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి మంగళవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు.. నన్నూరుకు చెందిన బోయతోట శివ రౌడీ షీటర్. ఇతనిపై పలు క్రిమినల్ కేసులున్నాయి. 2017 నవంబర్ 19న గ్రామంలోని అయాబ్ టీ హోటల్ వద్ద ఉన్న అజాం ఖాన్ సలాంబాషాపై బోయతోట శివ కత్తితో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన అజాంఖాన్ సలాంబాషాను అక్కడే ఉన్న అతని సోదరుడు అజాం షాలీఖాన్, మరికొందరు కలిసి చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని సోదరుడి ఫిర్యాదు మేరకు ఓర్వకల్లు పోలీసులు కేసు నమోదు చేసి అప్పటి కర్నూలు రూరల్ పోలీస్‌స్టేషన్ సీఐ నాగరాజు యాదవ్ నిందితుడిని అరెస్టు చేసి 20 మంది సాక్షులను విచారణ చేసి చార్జిషీటును కోర్టులో దాఖలు చేశారు. నిందితుడు బోయ తోట శివపై హత్య నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటరామిరెడ్డి ప్రాసిక్యూషన్ తరపున వాదించారు. నిందితుడికి శిక్ష పడటంలో కీలకంగా వ్యవహరించిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందించారు.

ముగిసిన ధ్రువపత్రాల పరిశీలన



కొలువులు సాధించిన వారి సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న డీపీఓ సిబ్బంది

కర్నూలు: ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన మంగళవారం ముగిసింది. జిల్లా పోలీసు కార్యాలయ పరేడ్ మైదానంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో రెండో రోజు సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగింది. వెరిఫికేషన్ ప్రక్రియ కోసం డీపీఓ గ్రౌండ్‌లో మొత్తం 12 కౌంటర్లు ఏర్పాటు చేశారు. అభ్యర్థులు సమర్పించిన ధ్రువీకరణ పత్రాలన్నిటినీ డీపీఓ సిబ్బంది సమగ్రంగా పరిశీలించారు. అభ్యర్థుల విద్యార్హతలు, క్రీడా సర్టిఫికెట్లతో పాటు ఇతర కేటగిరీలకు సంబంధించిన ధ్రువపత్రాలను సక్రమంగా పరిశీలించారు. సివిల్, ఏపీఎస్పీ విభాగాలకు ఎంపికైన 643 మంది అభ్యర్థులు వెరిఫికేషన్ ప్రక్రియకు హాజరు కావలసి ఉండగా 617 మంది అభ్యర్థులు హాజరయ్యారు. రెండు రోజులుగా పరేడ్ మైదానం కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులతో కోలాహలంగా మారింది. సివిల్ విభాగంలో 309 మందికి గాను 298 మంది, ఏపీఎస్పీ విభాగంలో 334 మందికి గాను 319 మంది హాజరయ్యారు. రెండు విభాగాలకు కలిపి 26 మంది అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కాలేదు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు హుసేన్ పీరా, కృష్ణమోహన్, డీపీఓ ఏఓ విజయలక్ష్మి, ఆర్ఐలు జావేద్, సోమశేఖర్ నాయక్, డీపీఓ సూపరింటిండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం 'సూపర్ ఫెయిల్యూర్'

- వెరిఫికేషన్ పేరుతో పింఛన్‌దారుల వైకల్య శాతం తగ్గించడం దారుణం
- ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి



మాట్లాడుతున్న ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి

ఆలూరు రూరల్: కూటమి ప్రభుత్వం హామీల అమలులో సూపర్‌గా ఫెయిల్యూర్ అయ్యిందని వైఎస్సార్‌సీపీ ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి విమర్శించారు. ఆలూరులోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావస్తున్నా ఒక్క కొత్త పింఛన్ కూడా మంజూరు చేయకపోగా ఉన్న పింఛన్లు తీసేస్తుండటం సిగ్గుచేటన్నారు. 90 శాతం వైకల్యం ఉన్నా వెరిఫికేషన్ పేరుతో 40 శాతం లోపే ఉందంటూ పింఛన్లు నిలిపేయడం సమంజసం కాదన్నారు. జిల్లా వ్యాప్తంగా నిలిపేసిన 8,300 వికలాంగుల పింఛన్లు వెంటనే పునరుద్ధరించాలన్నారు. నకిలీ పింఛన్ల ఏరివేత పేరుతో అర్హులైన దివ్యాంగుల పింఛన్లు తొలగించేందుకు కుట్ర పన్నితో భవిష్యత్‌లో బాధితుల ఉసురు తగులుతుందని హెచ్చరించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దివ్యాంగుల కోసం ప్రతి నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సదరం క్యాంపులు ఏర్పాటు చేసి వైకల్యం ఉన్న వారిని గుర్తించి ధ్రువపత్రాలు జారీ చేసి, అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కక్షసాధింపు చర్యల్లో భాగంగానే సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పేరుతో వైకల్య శాతం తగ్గించి పింఛన్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ మల్లికార్జున, ఎంపీటీసీ దేవరాజు, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

యూరియా మాయంపై దారి తప్పిన విచారణ

కర్నూలు(అగ్రికల్చర్): రైతులకు దక్కాల్సిన యూరియాను దారిమళ్లించిన డీసీఎంఎస్ డోన్ బ్రాంచీ మేనేజర్‌ను కాపాడేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. యూరియా పంపిణీలో అక్రమాలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనప్పటికీ.. అధికారులు మాత్రం అబ్బే అక్రమాలేవీ జరుగలేదు.. రైతులకు పంపిణీ చేశారంటూ స్పష్టం చేస్తున్నారు. పోలీసుల విచారణలో అక్రమాలు వెలుగు చూసిన వెంటనే ఇటు రైతులను, అటు టీడీపీ నేతలు, డీసీఎంఎస్ చైర్మన్, బిజినెస్ మేనేజర్లను సంప్రదించి తనకు క్లీన్‌చీట్ ఇచ్చే విధంగా ఏర్పాటు చేసుకున్నారు. అందుకు అనుగుణంగా ప్రతి ఒక్కరు యూరియా పంపిణీలో అక్రమాలేవీ లేవని చెబుతుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. డీసీఎంఎస్ చైర్మన్ డోన్ నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేతనే ఉన్నారు. అందువల్ల బ్రాంచీ మేనేజర్‌ను కాపాడేందుకు డీసీఎంఎస్ అధికారులు, వ్యవసాయ యంత్రాంగం ప్రయత్నాలు చేస్తోంది. డీసీఎంఎస్ డోన్ బ్రాంచీకి నంద్యాల మార్క్‌ఫెడ్ అధికారులు ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 68 టన్నుల యూరియా ఇచ్చారు. ఇందులో అత్యధికంగా జూలై, ఆగస్టు నెలల్లోనే వచ్చింది. వచ్చిన యూరియాను టీడీపీ నేతలు, వారి మద్దతుదారులకు పంపిణీ చేసినట్లు సమాచారం. యూరియా తీసుకున్న రైతులతో కాకుండా రైతులు కాని వారితో బయోమెట్రిక్ తీసుకున్నట్లు తెలుస్తోంది. డీసీఎంఎస్ ఉమ్మడిగానే ఉంది. మంగళవారం ఉదయం నుంచి కర్నూలు నుంచి వెళ్లిన డీసీఎంఎస్ అధికారులు, డోన్ ఏడీఏ, ఏఓలు యూరియా మాయంపైనే దృష్టి సారించారు. అక్రమాలు వెలుగు చూడకుండా, అంతా సక్రమంగా ఉందని, డీబీటీ ద్వారానే ఎరువులు పంపిణీ చేశారని కితాబు ఇస్తుండటం పలు అనుమానాలకు తావు ఇస్తోంది.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి



వెంకటేశ్వర్లు (ఫైల్)

మద్దికెర: మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో మంగళవారం ముగతి వెంకటేశ్వర్లు (55)అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్ఐ విజయ్‌కుమార్‌నాయక్ తెలిపిన వివరాలు.. రామలింగమ్మ, నాయుడుకు ఐదుగురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. కుమారుడు వెంకటేశ్వర్లుకు 23 ఏళ్ల క్రితం సరస్వతిని ఇచ్చి వివాహం జరిపించారు. వీరికి ఒక కూతురు వుంది. భార్య భర్తల మధ్య కొన్నేళ్లుగా తరచూ గొడవలు జరుగుతుండేవి. సరస్వతి పలుమార్లు బహిరంగంగానే భర్తపై దాడి చేసేంది. విడిపించేందుకు వెళ్లిన గ్రామస్తులను, సర్దిచెప్పేందుకు వెళ్లిన గ్రామ పెద్దలను సైతం అసభ్య పదజాలంతో దూషిస్తూ ఉండటంతో పట్టించుకోవడం మానేశారు. ఈక్రమంలో నాలుగైదు రోజులుగా చిత్రహింసలకు గురిచేసి ఇంట్లో వదిలేసి వెళ్లిపోయింది. ఆ తర్వాత తన భర్త చనిపోయాడని బంధువులకు ఫోన్ చేసి తెలపడంతో వారు అక్కడికి వెళ్లి చూడగా బోర్లాపడి అనుమానాస్పద స్థితిలో విగతజీవిగా పడి ఉన్నాడు. కాగా తన కుమారుడి మృతి పట్ల కోడలు సరస్వతిపై అనుమానం ఉందని మృతుని తల్లి రామలింగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పళ్ల బాస్కెట్‌లో పాము కలకలం



దానిమ్మ పండ్లు బాక్స్‌లో పాము

పత్తికొండ: విక్రయానికి తీసుకొచ్చిన దానిమ్మ పండ్ల బాస్కెట్‌లో మంగళవారం పాము కలకలం రేపింది. పత్తికొండకు చెందిన భానుప్రకాష్ రోడ్డు పక్కన తోపుడుబండి మీద పండ్లు అమ్ముకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. రోజువారీగా ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకున్న పండ్ల బాస్కెట్‌లను సర్దుకుంటుండగా దానిమ్మ పండ్ల బాస్కెట్‌లో అడుగున పాము కనిపించడంతో భయాందోళనకు గురయ్యాడు. అనంతరం తోటి వ్యాపారుల సహకారంతో పామును సంచిలో బంధించి అడవిలో వదిలిపెట్టాడు. సుదూర ప్రాంతాల నుంచి పండ్లు దిగుమతి చేసుకుంటామని, బాస్కెట్‌లోకి పాము అక్కడి నుంచి వచ్చి ఉండొచ్చని వ్యాపారి అనుమానం వ్యక్తం చేశాడు.

టౌన్ ప్లానింగ్‌లో ఇద్దరికి మెమోలు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశాలను ఖాతరు చేయని పట్టణ ప్రణాళిక విభాగానికి చెందిన ఇద్దరు ఉద్యోగులకు మంగళవారం మెమోలు జారీ చేశారు. కమిషనర్ ఇంటి సమీపంలో 2వ సచివాలయం పరిధిలోని నరసింగరావు పేటలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్నారు. బిల్డింగ్‌కు సంబంధించి నిర్మాణాల్లో డివియేషన్‌తోపాటు సెట్‌బ్యాక్స్ వదలక పోవడాన్ని గమనించిన కమిషనర్ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శికి చెప్పి పనులు నిలిపివేయాలని ఆదేశించారు. అయినా వారు పట్టించుకోకపోవడంతో ఆగ్రహించిన కమిషనర్ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ పి.ఖాశీం, ప్లానింగ్ కార్యదర్శి సుహేయిల్ జిక్రాఖాన్‌లకు మెమోలు జారీ చేశారు. రెండు రోజుల్లో లిఖిత పూర్వక సమాధానం ఇవ్వాలని లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

చిత్రం.. భళా!



పెన్ను క్యాప్‌పై వేసిన వినాయక చిత్రాలు



కర్పూరం బిళ్లపై చిత్రీకరించిన వినాయకుడు

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని నంద్యాల చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ పెన్ను క్యాప్‌పై 60 వినాయకుల చిత్రాలు గీచి అబ్బురపరిచారు. ఈ సందర్భంగా కోటేష్ మాట్లాడుతూ చిత్రంలో గణనాథుడు భక్తులకు అభయమిస్తున్నట్లు, ఓంకారంలో గణపతులు, శంకు ఆకారంలో గణేషుడు, కాని పాకం గణపతి, త్రిముఖ గణపతి, నాట్య భంగిమ గణపతి ఇలా పలు రూపాల్లో ఒకే క్యాప్‌పై 60 చిత్రాలు గీశానన్నారు. స్వామి వారి వాహనమైన ఎలుక స్వామిని భక్తితో మొక్కుతున్నట్లు చిత్రించానన్నారు.

– నంద్యాల(అర్బన్)

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని నంద్యాలకు చెందిన చిత్రకారుడు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు తుర్లపాటి సుబ్రహ్మణ్యం కర్పూరం బిళ్లపై గీసిన వినాయకుడి సూక్ష్మ చిత్రం ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా చిత్రకారుడు మాట్లాడుతూ భగవంతునికి చేసే షోడశోపచారాలలో ఆనంద కర్పూర నీరాజనం విశిష్టమైనదన్నారు. ప్రజలందరికీ గణేశుని అనుగ్రహం కలగాలనీ, విఘ్నాలు తొలగాలని కోరుకుంటూ కర్పూరం బిళ్లపై వరసిద్ధి వినాయకుని సూక్ష్మ చిత్రాన్ని వేశానన్నారు.

– నంద్యాల(వ్యవసాయం)

అంతర్రాష్ట్ర దోపిడీ దొంగల ముఠా అరెస్ట్





దారిదోపిడీ దొంగల ముఠాను అరెస్ట్ చూపిస్తున్న పోలీసులు, స్వాధీనం చేసుకున్న కత్తులు

- రూ.10.85 లక్షల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాల స్వాధీనం
- ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా

నంద్యాల: ఎనిమిదేళ్లుగా దొంగతనాలు, దారిదోపిడీలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్న ముఠాను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా తెలిపారు. మంగళవారం ఎస్పీ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలు వెల్లడించారు. బండిఆత్మకూరు మండలం నెమళ్ల కుంట గ్రామానికి చెందిన చెంచు దాసరి అంకన్న, పాణ్యం మండలం చెంచు కాలనీకి చెందిన బాపట్ల సత్యహరిశ్చంద్రుడు, పాణ్యం చెంచు కాలనీకి చెందిన బాపట్ల చిన్న హుసేని, గడివేముల మండలం కరిమద్దెల గ్రామానికి చెందిన చెంచు దాసరి జమ్ములు ముఠాగా ఏర్పడి నంద్యాల, కర్నూలు, ప్రకాశం, సత్యసాయి, అన్నమయ్య, గుంటూరు జిల్లాల్లో దొంగతనాలు, దోపిడీలకు పాల్పడ్డారు. దొంగిలించిన బంగారు, వెండి వస్తువులు, నగదును పాణ్యం మండలం పిన్నాపురం కొండల వద్ద దుర్గం వాగులో ఉన్న వాటర్ ఫాల్స్ సమీపంలో గుడారాలు వేసుకొని అందులో దాచి పెట్టేవారు. నంద్యాల జిల్లాలో జరిగిన ఘటనల్లో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పక్కా నిఘా ఉంచి గుడారాల్లో ఉన్న దొంగల ముఠాను చాకచక్యంగా పట్టుకున్నారు. విచారణలో రాత్రి సమయాల్లో రోడ్డు పక్కన దారిదోపిడీలు చేసినట్లు, తాళాలు వేసిన ఇళ్లలో దొంగతనాలు చేసినట్లు నిందితులు అంగీకరించారు. వీరి వద్ద నుంచి రూ.10.85 లక్షలు విలువ చేసే 11 తులాల బంగారం, 21 తులాల వెండి, రూ.10 వేల నగదు, రెండు బైక్‌లు, నాలుగు పిడిబాకులు, కత్తులు స్వాధీనం చేసుకున్నారు. దొంగల ముఠాను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ఎస్పీ అభినందించి, నగదు రివార్డు అందజేశారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు, సబ్ డివిజన్ ఏఎస్పీ మందజావళి ఆల్ఫోన్స్ పాల్గొన్నారు.